


# పరదేశీ కథలు

## - చిట్టే సిద్ధ లలిత



-89-

## నాగమ్మ కథ

**బియా.. బియా.. అని అరుస్తూ** ఆ వీధంతా తిరిగింది నాగమ్మ. ఆ రోజెందుకో ఒక్కరు కూడా తలుపు తెరిచి లోనికి రమ్మని పిలవలేదు. వీధంతా నిర్మానుష్యంగా వుంది. ఇండియాలోని వీధుల్లో జన సంచారం వున్నట్లు కువైట్ లో వుండదు. మిట్ట మధ్యాహ్నం ఎండకు కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. దాహంతో నాలుక పిడచ గట్టక పోతోంది. పొద్దుట్నించీ వీధులన్నీ నడిచి కాళ్ళు లాగుతున్నాయి.

దేశం కాని కువైటు దేశంలో నడివీధిలో ఎండకు బడి, వీధులన్నీ తిరుగుతూ బట్టలు అమ్ముకునే తన దుస్థితికి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. కన్నీళ్ళు కాసేపే.. బాధను అణచిపెట్టుకుని దు:ఖాన్ని నిగ్రహించుకుంది నాగమ్మ.

ఒక్కగానొక్క ఆడపిల్లని అల్లారుముద్దుగా గుండెల మీద వుంచుకుని పెంచిన తండ్రి, కన్నతల్లి ప్రేమ గుర్తొచ్చి హృదయం బాధతో మూలిగింది.

చచ్చి ఏ లోకాన వున్నారో తల్లిదండ్రులు. కన్నప్పుడు ఊహించి వుండరు కదా బిడ్డ ఇన్ని కష్టాలు పడుతుందని. అలా తెలిసి వుంటే పురిట్లోనే చంపి పారేసే వాళ్ళేమో.

అన్నలు వదినలు చేసిన ద్రోహం గుర్తొచ్చి కోపంతో మనసు మండింది. భుజాన మోస్తున్న గుడ్డల మూట బరువెక్కింది. వళ్ళు స్వేదంతో తడిసిపోయింది. శక్తి నశించిపోతోంది.

ఇక తప్పదని ఒక ఇంటి ముందు ఆగి చిన్నగా ప్రహరీ తలుపును కొట్టింది. ఏ దేవుడు మొరను ఆలకించాడో తెలియదు. తలుపు కొట్టిన శబ్దం విని వెంటనే వచ్చి తలుపు తీసింది కౌసల్య.

ఎదురుగా గుడ్డల మూట చంకన బెట్టుకుని కనిపించింది నాగమ్మ.

"అమ్మో.. నువ్వు ఈ రోజే వచ్చావా. ఈ రోజు మా బాబా డ్యూటీకి పోకుండా పడుకొని నిద్రపోతున్నాడు. చూసాడంటే తిడతాడు. నువ్వు రేపు ఇదే టైముకు రాపో నాగమ్మా" అంది కౌసల్య భయంగా ఇంటి వైపు చూస్తూ.

"సరే కానీ కాసిన్ని నీళ్ళివ్వు తల్లీ. తిరిగి తిరిగి దాహంగా వుంది. తాగి వెళతాను" అంది నాగమ్మ అర్థింపుగా.
వాడిపోయిన నాగమ్మ ముఖం చూసి "అయ్యో వుండు బాటిల్లో ఫ్రిజ్ నీళ్ళు తెస్తాను" అంటూ లోపలికి పోయింది కౌసల్య.

వీళ్ళ మాటలు వినబడ్డ చంద్రిక హడావిడిగా అక్కడికి వచ్చి "ఇంత బరువును మోసుకుంటూ ఇంతదూరం మనకోసమే వచ్చింది ఈ నాగమ్మ. మరలా రేపు రమ్మంటే ఎట్లా వస్తాది అక్కా. ఈ పక్క గోడ కిందకి వచ్చి గుడ్డల మూట విప్పి చూపిస్తాది. మనం తొందరగా చూసి నచ్చినవి తీసుకుని పంపించేద్దాం. బాబా ఇప్పుడప్పుడే లేవడులే" అంది.

"సరే పదండి" అని చెప్పి అందరు అటు గోడవైపు పోయారు. కౌసల్య, చంద్రిక ఇద్దరూ శ్రీలంక నుండి వచ్చిన పనిమనుషులు. ఆ కువైట్ ఇంట్లో దాదాపూ నాలుగేళ్ళ నుండీ పని చేస్తున్నారు.నాగమ్మ నెలరోజులకొకసారి వచ్చి బట్టలు అమ్మి వెళుతూ వుంటుంది.

ఇదంతా కువైట్ వాళ్ళకు తెలియకుండా వాళ్ళు ఆఫీస్ కి వెళ్ళిన సమయాల్లోనే జరుగుతూ వుంటుంది. కౌసల్య సింహళీ. చంద్రిక శ్రీలంకలో స్థిరపడిన తమిళియన్. అందుకే వాళ్ళతో కామన్ గా అరబ్బీ భాషలోనే సంభాషిస్తూ వుంటుంది నాగమ్మ.

గుడ్డలన్నీ చూసి కౌసల్య కళ్ళు మెరిసాయి. "అబ్బ ఎంత బావున్నాయో కదా. నాలుగు జతలన్నా తీసుకోవాలి కానీ చేతిలో ఒక్క దినారు కూడా లేదే" అని నిట్టూర్చింది.

"కావల్సినవి తీసుకో కౌసల్యా. ఇవ్వకుండా ఎక్కడికి పోతావు. జీతాలు వచ్చాక ఇద్దువులే. ఆ బెంగాలీ సమీరా పారిపోయినట్లు రాత్రికి రాత్రి శ్రీలంకకు పారిపోవు కదా" అంది నాగమ్మ.

ఈ లోపల చంద్రిక రెండు జపాన్ చీరలు తీసి పక్కన పెట్టింది."నేను కూడా జీతాలు వచ్చిన తరవాతే ఇస్తాను" అని చెప్పింది.

"పరవాలేదులే పది రోజుల తరవాత వస్తాను. అప్పుడు మరిన్ని కొత్త బట్టలు తెస్తాను తీసుకుని మొత్తం ఇద్దురు" అనింది నాగమ్మ.

"మంచిదానివే కువైట్ లో మనుషుల్ని నమ్మి అప్పు ఇస్తే అంతే. మంచితనం పనికి రాదు అందర్నీ నమ్మకు జాగ్రత్త. ఇంతకీ ఆ బెంగాల్ దానికి ఎంత అప్పు ఇచ్చావేమి" అంది కౌసల్య.

పేలవంగా నవ్వింది నాగమ్మ. "బాగానే నష్టపోయాను. అయినా వాళ్ళేమి బాగుపడతారులే. అయినవాళ్ళే మోసం చేసి సంపాదనంతా దోచుకుని కట్టు బట్టలతో ఇంట్లోంచి బయటికి తోసారు. నన్ను గుండెకోతకు గురి చేసారు. నమ్మినందుకు ఈ శిక్ష పడాల్సిందే కదా. ఇంతకు మించి బయటివాళ్ళ మోసం ఎంతలే" అని నిట్టూర్చింది.

తెల్లబడిన తల వెంట్రుకలను, ముడతలు పడిన ఆమె దేహాన్ని పరీక్షగా చూస్తూ "ఏమయింది నాగమ్మా" అడిగింది చంద్రిక.

"చెబుతాను.. మీతో చెప్పుకుంటే నా బాధ కాస్తయినా తగ్గుతుంది. కష్టసుఖాలు పంచుకోవడానికే మనం వున్నాం. నేను యాభై యేళ్ళ క్రితం నా పద్దెనిమిదో యేట కొయేటికి వచ్చాను.
నాకు పన్నెండేళ్ళ వయసులోనే మా అమ్మా నాయనా చనిపోయారు. పొలంలో పాము కరిచి మా నాయన పోతే ఆ దిగులుతో అదే సంవత్సరం మా అమ్మ కూడా చనిపోయింది. మా ఎదురింటి పీరమ్మ ఒసే వీసా పంపిస్తా కోయేటికి రాయే. నేనున్న ఇంట్లోకే తీస్తాను అంటే కొయేటు ఎలా వుంటాదో చూద్దాం అని వచ్చాను.
మా బాబా పెద్ద షేకు. చేతికి ఎముక లేకుండా దానధర్మాలు చేసేవాడు. పనిమనుషులకు జీతమేకాక వారానికో, పదిరోజులకో పిలిచి మరీ దినార్లు చేతికిచ్చేవాడు. పని కూడా తక్కువే వుండేది. అంత మంచి ఇల్లు దొరకడం నా అదృష్టమని సంతోషించాను."
"ప్రతి నెలా జీతం రాగానే డబ్బంతా కలిపి మొత్తం మా అన్నలకు పంపేదాన్ని. నేను పంపిన డబ్బుతో వుంటున్న పూరి కొట్టం కూలదోసి రెండు పోర్షన్లుగా మిద్దె ఇల్లు కట్టారు. కాస్త పొలం కొన్నారు. అన్నీ నీకే అన్నారు. నాకెందుకులే మీరు సంతోషంగా వుండండి చాలు అన్నాను. అలా ఆరేళ్ళు తిరిగిపోయాయి.
ఈ లోపల ఇద్దరు అన్నలూ పెళ్ళి చేసుకున్నారు. ఈ మధ్యలో పీరమ్మ రెండుసార్లు ఇంటికి పోయి వచ్చింది. ఇంట్లోకి, అన్నవదినలకు అవసరమైనవన్నీ పంపించాను. నువు వచ్చి ఆరేళ్ళు గడిచాయి కదా ఒకసారి నువ్వు ఇంటికి పోయిరా బావుంటుంది అనింది పీరమ్మ. సరే అని బాబాకు చెప్పి టికట్ తీసుకోని ఇండియాకు వచ్చినాను.
ఆరేళ్ళ తరవాత మద్రాసు ఎయిర్ పోర్టు లో దిగుతుంటే వళ్ళు పులకరించింది. మా అన్నలను చూడగానే కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఎంత సంతోషమో మాటల్లో చెప్పలేను.
ఇల్లు చేరగానే వదినలు ఇద్దరూ ఎదురొచ్చి బ్యాగులు అందుకుని ఆప్యాయంగా హత్తుకున్నారు. కట్టిన మిద్దె ఇల్లును కళ్ళారా చూసాను. ప్రతి గోడనూ తడిమి చూసాను. మా అమ్మా నాయనా తిరిగిన నేలను ఆప్యాయంగా పలకరించాను. అన్నలు నన్ను అడుగు కింద పెట్టనివ్వలేదు. వదినలు వంటలన్నీ చేసిపెట్టి అపురూపంగా చూసుకున్నారు. అప్పటికి పెద్ద వదినకు ఒక కొడుకు పుట్టాడు. సంవత్సరం పిలగాడితో కాలమే తెలియలేదు. స్వర్గం అంటే ఇదే కదా అనిపించింది. కువైట్లో నీడపాటున వుండి మంచి తిండి తిని ఇరవై ఐదేళ్ళ వయసులో మిసమిసలాడి పోతున్నాను నేను."

బంధువులంతా నన్ను చూడటానికి వచ్చారు. వచ్చిన వాళ్ళందరికీ తెచ్చిన బహుమతులు ఇచ్చాను.
మా మేనమామ చంగయ్య వచ్చి ఏ వయసులో ముచ్చట ఆ వయసులో జరగాలి. ఇప్పటికే ఆలశ్యం అయింది.
ఇక కోయేటికి ఏం పోతుంది. మంచి సంబంధం చూసి నాగమ్మకు పెళ్ళి చేద్దాం అన్నాడు.
మా అన్నల ముఖాలు వాడిపోయాయి. ఆయమ్మి ఇష్టం మామా అన్నారు. మా వదినలు ఇద్దరూ కూడబలుక్కుని..
నాగమ్మ రెండు నెలల సెలవుపై వచ్చింది. అక్కడ సేటోళ్ళు ఈమె తిరిగి వస్తాదని ఎదురు చూస్తుంటారు కదా.
ఇప్పటికిప్పుడు ఆడబిడ్డ పెళ్ళంటే ఎంత ఖర్చు. ఇల్లు కట్టుకుంటిమి. పొలం కొంటిమి. ఇంకా కొన్ని అప్పులే మిగిలివున్నాయి. చేతిలో సరిపడా దుడ్డు లేకుండా పెళ్ళి ఎలా చేస్తాం. ఇంకో రెండేళ్ళకు మరలా వచ్చినపుడు మంచి సంబంధం చూసి చేద్దాంలే చిన్నాయనా. నువు ఎక్కువ ఆలోచన చెయ్యమాక అన్నారు. అదికాదురా ఒక్కగానొక్క ఆడపిల్ల కోయేటికి పోయి దుడ్డు సంపాదించాలా అని సణిగాడు ఆయన.
ఇక మామను మాట్లాడనీయకుండా చేనికాడికి పోదాంపా మామా అని చిన్నన్న ఆయనను తోడ్కోని బయిటికి పోయినాడు. అట్లా ఇద్దరు ముగ్గురు ఆడోళ్ళు కూడా నాకు పెళ్ళి చెయ్యమని మొహాన్నే అడిగినారు.
మరలా రెండేళ్ళకు వచ్చినప్పుడు చేస్తాంలే అని చెప్పినారు మా వదినలు.
ఇంకా రెండేళ్ళు కష్టపడితే అప్పులు తీరతాయి నాగమ్మా. తరవాత ఏ కష్టమూ వుండదు అని మా అన్నలు చెప్పడంతో నాకు కూడా కొయేటికి పోయి డబ్బు బాగా సంపాదించి అప్పులు తీర్చాలనే అనిపించింది.
ఎడారి సంపాదనకు ఇంట్లో వాళ్ళ కోరికలకు అంతం వుండదని అప్పట్లో తెలియలేదు. వున్న రెండు నెలలూ అన్న వదినలు నన్నెంతో ప్రేమగా చూసుకున్నారు. అందుకే వాళ్ళను వదిలి కువైట్ కు తిరిగి వెళ్ళాలంటే బాధగా అనిపించింది.
కాలం ఎవరికోసమూ ఆగదు. అప్పులు తీర్చడం, ఇంట్లో అవసరాలు చూడటంతో ఇంకో ఐదేళ్ళు గడిచాయి.
అన్నలు ఏదో ఒకటి చెబుతూనే వున్నారు. పంపించే డబ్బు ఇంటి ఖర్చులకు పుట్టే పిల్లలకు, ఆసుపత్రికి, మందులకూ సరిపోవడం లేదు అనే వాళ్ళు.
నీకంటూ పొలమో ఇల్లో కొనకుండా కోయేటు వదిలి వస్తే ఎలా. ఇక్కడ ఏం తిని బతుకుదాం అనే వాళ్ళు. వచ్చిన డబ్బంతా పైసాతో సహా పంపించేదాన్ని.
కొంతమంది శ్రేయోభిలాషులు పిచ్చిదానా నీ కష్టమంతా వాళ్ళకు పెట్టి పెళ్ళీ ఇల్లూ లేకుండా ఎలా బతుకుతావు.
ఏ సుఖమూ లేకుండా నీ బతుకు ఎడారి పాలేనా ఇప్పటికైనా జాగ్రత్త పడు అని చెప్పేవాళ్ళు. నువ్వు దిగులు పడకు.
నీకు ఏదో ఒకటి ఏర్పాటు చేస్తాము. మేమున్నాము కదా అనే వాళ్ళు మా అన్నలు. అలా ఇరవై ఏండ్లు గడిచిపోయాయి."

నా జీవితం నిస్సారంగా ఎడారికి అంకితమై పోయింది. ఆ కువైట్ ఇల్లే నా ప్రపంచం అయింది. అన్నలకు పుట్టిన పిల్లోళ్ళు కూడా పెద్దోళ్ళయి కాలేజీ చదువులకు వచ్చేసారు. ఆడపిల్లలు పెళ్ళీడుకు వచ్చారు.

కూతురుకు పెళ్ళి పెట్టుకున్నాము బంగారం పంపించు అని చిన్న వదిన చెప్పింది. పెళ్ళికయినా రమ్మంటారేమో అని ఆశ పడ్డాను. ఎవ్వరూ పిలవలేదు సరికదా అవి పంపించు ఇవి పంపించు అంటూ అడిగారు.

అక్కడికీ నోరు తెరిచి వదినా మీ అందర్నీ చూసి చాలా ఏళ్ళయింది. పిల్ల పెళ్ళికి వచ్చేదా అని అడిగాను.

ఇప్పుడెందుకమ్మా రావడం. ఆడపిల్ల పెళ్ళి ఏదో సింపుల్ గా చేస్తున్నాము. మగ పిల్లాడి పెళ్ళికి వద్దువులే. కావాలంటే ఫోటోలు పంపిస్తాము చూద్దువు అంది.

ఎందుకో చాలా బాధ కలిగింది. ఆ రాత్రి నిద్ర పట్టలేదు. మా అమ్మానాన్నలను తలచుకొని ఏడ్చుకున్నాను. పెద్దన్న కొడుకు ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడట. అందుకే ఎవర్నీ పిలవలేదు. అలా చూస్తుండగానే ఇంకో పిల్ల పెళ్ళి కూడా చేసేసారు. అప్పటికి నాకు అర్థం అయింది. నేను ఇంటికి వెళ్ళడం వాళ్ళకు ఇష్టం లేదు.

డబ్బు సంపాదించే యంత్రంలా ఇక్కడే ఈ ఎడారిలో పడి వుండాలి. వాళ్ళ అవసరాలన్నీ తీర్చాలి. ఇక కుదరదని ఒకసారి ఇంటికి వెళ్ళి వద్దామని చెప్పకుండా బయల్దేరి వెళ్ళిపోయాను.

ఇందులో పీరమ్మ ప్రోత్సాహం కూడా వుంది. వాళ్ళ అసలు రంగు బయట పడుతుంది వెళ్ళు అంది పీరమ్మ.

నన్ను చూడగానే అన్నావదినలు కలవరపడ్డారు. ఎందుకొచ్చావు. ఏమయింది అని కంగారుగా అడిగారు.

అక్కడ కువైట్ లో వుండాలని అనిపించలేదు. అక్కడ ఎన్నేళ్ళు వున్నా అది పరాయి దేశమే కదా. ఇక ఇక్కడే మీతో వుండిపోతాను అని చెప్పాను. వాళ్ళ ముఖాలు ఆముదం తాగినట్లు మాడిపోయాయి.

రెండ్రోజుల్లో నిజ స్వరూపం చూపించారు. నన్ను ఎన్నో మాటలు అన్నారు. చాలా బాధలు పెట్టారు. అన్నం కూడా పెట్టలేదు. ఇలా జరుగుతుందని నేనెప్పుడూ ఊహించలేదు.

ఒకరోజు.. నువ్వు కువైట్ కి పోవాల్సిందే. ఇక్కడ వుండి ఏమి చేస్తావు అన్నాడు చిన్నన్న. వదినలు వంత పాడారు. ఇక వెళ్ళను. నేను పంపిన డబ్బు కొంతయినా తిరిగి ఇస్తే ఏదో ఒకటి చేసుకుని ఇక్కడే బతుకుతాను అన్నాను ధైర్యంగా.

ఇక గొడవ మొదలయింది. వదినలు కక్షగట్టి కూడబలుక్కుని అన్నలు లేని సమయంలో ఇంట్లోంచి బయటికి తోసారు. వెళ్ళి బంధువుల ఇంట్లో తలదాచుకున్నాను. తరువాతే తెలిసింది అన్నలే ఆ విధంగా చేయించారని. గుండె పగిలింది. అయిన వాళ్ళు చేసిన ద్రోహానికి దు:ఖం వరదయ్యింది. ఛీ వీళ్ళు రక్తాన్ని పంచుకుని పుట్టిన అన్నలేనా. జన్మలో వీళ్ళ ముఖం చూడకూడదు అనుకుని మరలా విమానం ఎక్కాను. ఇక్కడికి వచ్చాను. దురదృష్టం ఏమిటంటే నేను వచ్చేసరికి మా సేటు చనిపోయాడు. మామా.. ఇంతమంది పనిమనుషులు వద్దు

జీతాలు ఇవ్వలేను అని చెప్పి సగం మందిని బయటికి పంపేసింది. వాళ్ళలో నేనూ వున్నాను."

నా రాత ఎందుకిలా అయింది అని ఏడ్చుకుంటూ మా ఊరి వాళ్ళ దగ్గరికిపోయి తలదాచుకున్నాను.

తర్వాత ఊరికే కూర్చుంటే ఈ దేశంలో పొట్ట నిండేదెలా అని ఇలా వీధులన్నీ తిరుగుతూ మీలాంటి వాళ్ళకు బట్టలు అమ్ముకుని వచ్చిన కొన్ని దినార్లతో జీవనాన్ని సాగిస్తున్నాను. అందరూ వున్నా ఎవరూలేని ఒంటరినయ్యాను అంటూ తన జీవితాన్ని కథలా చెప్పి భారంగా నిట్టూర్పు విడిచింది నాగమ్మ.

"అయ్యో ఎంత కష్టమొచ్చింది నీకు. అయినవాళ్ళు డబ్బంతా తినేసి ఇలా వీధిలో తోయడం ఎంత అమానుషం" అంటూ కౌసల్య, చంద్రిక కన్నీళ్ళు విడిచారు.

"ఇంతలో కౌసల్యా.." అంటూ ఇంట్లోంచి కేకేసాడు బాబా.

భయపడుతూ "బాబా వస్తున్నా" అని బదులిచ్చింది కౌసల్య.

"ఆ నాగమ్మను ఇంట్లోకి రమ్మని చెప్పి అన్నం పెట్టండి" అన్నాడు బాబా.

ఏమీ అర్థం కాక ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు వీళ్ళు.

నాగమ్మను ఇంట్లోకి తీసుకపోయారు.

కోపంగా వుంటాడనుకున్న బాబా నవ్వుతూ. "నాగమ్మా నీ కథంతా కిటికీలోంచి విన్నాను. అందరినీ కాపాడేందుకు పైన అల్లా వున్నాడు. నువు బాధ పడకు.

ఇకనుండీ మా ఇంట్లో వుండి వంటపని చెయ్యి. నీకు మంచి జీతం ఇస్తాను. ఇండియాలో నువ్వు ఇల్లు కట్టుకోవచ్చు" అన్నాడు.

సంతోషంతో నాగమ్మకు నోట మాట రాలేదు.

"బాబా ఆ అల్లా నిన్ను చల్లగా చూడాలి" అంటూ చేతులెత్తి దణ్ణం పెట్టింది.

"అవును నిన్ను మా అక్క అనుకుంటాం. ఇక్కడే మాతోపాటూ వుండు నాగమ్మా" అంటూ చేయి పట్టుకుంది చంద్రిక.

దిక్కులేని వాళ్ళకు దేవుడే దిక్కు అనుకుంది కౌసల్య మనసులో.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments